

సమస్యలపై దృష్టి సారించాలి : ఎంపిపి

ప్రజాశక్తి-కలకడ

ప్రజా సమస్యలపై దృష్టి సాధించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ సచివాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సకాలంలో సమయానికి వచ్చి, ప్రజలకు ఉన్న సమస్యలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు అందుతున్నాయా, లేదా అని ఆరా తీయాలని తెలిపారు. వాటిని ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్క సిబ్బంది నిజాయితీగా పనిచేసి రాష్ట్రానికి, జిల్లాకు, మండలానికి పేరు పరిశీల తేవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నియంతలా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే : సిపిఎం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా నియంతలాగా వ్యవహరిస్తున్నాడని సిపియం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి డి.ప్రభాకర్ రెడ్డి, నాయకులు ఎ.వెంకటేష్, కె.చంద్రశేఖర్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ నిద్ర లేచినప్పటి నుండి నిజాయితీ గురించి మాట్లాడే ఎమ్మెల్యే ఎలాంటి అనుమతులు లేని వెన్నెల రెస్టారెంట్‌ను ప్రారంభించడానికి ఎంతకు అమ్ముడు పోయారని ప్రశ్నించారు. గడప గడపకూ తిరుగుతూ అమ్మచెరువుమిట్టలో ఉన్న పేదల ఇండ్లు అక్రమ నిర్మాణాలనే సాకుతో దగ్గరుండి కూలగొట్టించిన నవాజ్ బాష, వైసిపి నాయకులు తట్టి శ్రీనివాసులురెడ్డి, జడ్‌పిటిసి ఉదయకుమార్, అయూబ్, కత్తి రాజు తదితరులు వేంపల్లి, రామాచార్లపల్లి, నేతాజి కాలనీ, సిటియం ప్రాంతాల్లో వేసిన అక్రమ లే అవుట్‌ల జోలికి ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. నవాజ్ బాష నిజాయితీ నేతి బీరలోని నెయ్యి మాదిరిగానే ఉందన్నారు. భూమి కన్వర్షన్ చేయకుండా, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ తీసుకోకుండా, హోటల్ నిర్వహణకు ప్రభుత్వ అనుమతి పొందకుండా నిర్మించిన వెన్నెల రెస్టారెంట్, వారపుసంతలో షెడ్లు నిర్మాణం నవాజ్ బాష కనుసన్నల్లోనే జరిగాయని విమర్శించారు. కలెక్టర్ జోక్యం చేసుకొని అక్రమ లేఅవుట్‌లపై విచారణ జరిపించాలని, వెన్నెల రెస్టారెంట్‌ను తొలగించాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలను కూడగట్టి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

పేదలకు భూ పంపిణీ చేయాలి

- వ్య.కా.స రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

మైదుకూరు: పదేళ్ల నుంచి రాష్ట్రంలోని పేదలు ప్రభుత్వ భూములు నోచుకోలేదని భూ పంపిణీ చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం మైదుకూరు పట్టణం కడప రోడ్‌లోని షాదిఖాన్ హాల్‌లో వ్య.కా.స జిల్లా 6వ మహాసభలు నిర్వహించారు. జిల్లా మహాసభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ భూములు విస్తారంగా ఉన్నాయన్నారు. అర్హులకు అందకుండా అనర్హులైన రాజకీయ నాయకులు, స్థానిక ధనవంతులు వందల ఎకరాలను ఆక్రమించుకొని ఎస్టేట్స్‌గా మలుచుకున్నారన్నారు. అన్యక్రాంతులు ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడంలో రెవెన్యూ యంత్రాంగం ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేసి స్థానిక పేదలకు భూ పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని 25 శాతం నిధులు బడ్జెట్‌లో తగ్గించి గ్రామీణ పేదలకు పొట్ట కొట్టిందన్నారు. వలసల నివారణకు రూ. 2 లక్షల కోట్ల నిధులు బడ్జెట్‌లో కేటాయించాలని చెప్పారు. రూ. 200 రోజులు పనులు కల్పించాలని, ప్రతి శనివారం చేసిన పనులకు డబ్బులు చెల్లించాలని పేర్కొన్నారు. మస్టర్ విధానం, సమ్మర్, ఇతర అలవెన్సు ఇవ్వాలని చెప్పారు. గ్రామంలో పెద్ద ఎత్తున ఉపాధి భూ సమస్యలపై ఆందో ళనలు చేపడతామని పిలుపునిచ్చారు. మహాసభలో ముందుగా వ్యవసాయ కార్మిక సంఘం జెండా ఆవిష్కరణను జిల్లా అధ్యక్షులు వెంకటేష్ ఆవిష్క రించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులురెడ్డి, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సుబ్బమ్మ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి, ఆవాజ్‌అధ్యక్షుడు చాంద్ బాషా, శారద ప్రసంగించారు. కార్యక్రమంలో అన్వేష్, ఉపాధ్యక్షులు జి శివకుమార్, చంద్రశేఖర్ నరసయ్య, వీరయ్య, గురవయ్య, పోలయ్య రాయప్ప, దేవ, సురేష్ బాబు, రవణమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మొహియుద్దీన్

కాంగ్రెస్‌కు మొహియుద్దీన్ రాజీనామా

ప్రజాశక్తి-కలికిరి

పిసిసి సెక్రెటరీ, పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కెఎస్ ఆగ మొహియుద్దీన్ గురువారం కాంగ్రెస్ పార్టీకి, తన సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. గురువారం కలికిరిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో కనుమరుగైన కాంగ్రెస్ పార్టీని అభివృద్ధిలోకి తీసుకుని వచ్చి రాష్ట్ర స్థాయిలో కదలిక తెచ్చానని తెలిపారు. తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా జిల్లా స్థాయిలో అత్యధిక ఓట్లు సాధించిన మొదటి వ్యక్తిగాను, రాష్ట్ర స్థాయిలో మూడో వ్యక్తిగాను ఉన్నానని చెప్పారు. కాంగ్రెస్‌లో కొందరి నిర్వాకం వల్ల సీనియర్లకు గుర్తింపు ఇవ్వకుండా ఎప్పుడూ, ఎక్కడా కనపడని వ్యక్తులకు రాష్ట్ర స్థాయి పోస్టులు ఇవ్వడం, వారి దగ్గర పనిచేసే డ్రైవర్లకు, పనిమనుషులకు కాంగ్రెస్ పార్టీలో జిల్లా పోస్టులు ఇచ్చారన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరపున రెండు సార్లు ఎమ్మెల్యేగా నిలబడిన చంద్రశేఖర్‌రెడ్డికి డెలిగేట్‌లో స్థానం కల్పించకపోవడం తదితర కారణాలతో పాటు తనకు సరైన గుర్తింపునివ్వని కారణంగా కాంగ్రెస్ పార్టీకి, తమ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. పీలేరు నియోజకవర్గంలోని మైనార్టీల అభివృద్ధితో పాటు, తన భవిష్యత్తు కార్యాచరణ, తనను నమ్ముకున్న కార్యకర్తల కోసం త్వరలోనే నిర్ణయాన్ని ప్రకటిస్తానని తెలిపారు. జోడో యాత్ర ప్రభంజనం సృష్టిస్తున్న సందర్భంలో తాను కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం బాధాకరంగా ఉన్నా తప్పని పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్లు తెలిపారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి-కలికిరి

కృషి విజ్ఞాన కేంద్రంలో పుట్టగొడుగుల పెంపకంపై గురువారం రైతులకు శిక్షణ ఇచ్చారు. 30 మంది రైతులు, యువత పాల పుట్టగొడుగులు, ముత్యపు చిప్ప పుట్టగొడుగులను పెంచే విధానాన్ని ప్రదర్శన ద్వారా తెలుసుకున్నారు. బీకాం చదువుతున్న 20 మంది విద్యార్థులు శిక్షణలో పాల్గొని పుట్టగొడుగుల సాగు గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కెవికె సమన్వయకర్త డాక్టర్ ఎంకె.జ్యోత్స్న, వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి.అరుణశ్రీ, డాక్టర్ ఎం.గురువిరెడ్డి, డాక్టర్ ఎం.ప్రదీప్ పాల్గొన్నారు.

దళిత నాయకుడిపై దాడి హేయం : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్‌తో పాటు దళిత మహిళలపై గుంటూరు జిల్లా నగర పాలెం సిఐ హేమంత్ బాబు అసభ్య పదజాలంతో దూషించి దాడి చేయడం హేయమైన చర్యని ఎంఆర్‌పిఎస్ కడప, అన్నమయ్య ఉభయ జిల్లాల కన్వీనర్ వెలగచర్ల శివయ్య పేర్కొన్నారు. దాడికి నిరసనగా ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ భవన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ దగ్గర ప్రధాన రహదారిలో బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో దళితులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. 14 ఏళ్ళ దళిత బాలికను అత్యాచారం చేసిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేయాలంటూ కలెక్టరేట్ వద్ద శాంతియుత దీక్షలు చేపట్టిన ఎంఆర్‌పిఎస్ నాయకులు, దళిత మహిళలపై చేయి చేసుకోవడమే కాకుండా మహిళలపై చేతులేసి అనుచితంగా ప్రవర్తించిన సిఐ హేమంత్ బాబును వెంటనే అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళిత బాలికను అత్యాచారం చేసిన అగ్రవర్ణానికి చెందిన కోవెలపూడి సాంబశివరావు చౌదరిని కఠినంగా శిక్షించి దళితుల మనోభావాలను సంరక్షించవలసినదిగా కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు వడ్డెర పెంచలయ్య, జిల్లా నాయకులు చేమూరు వెంకటేష్, మందా శివయ్య, జడ శివ, వంశి, తేజ, సాయి, వెంకీ, చంద్రకాంత్ పాల్గొన్నారు.



ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న నాయకులు



ఎపిఎండిసి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

కొనసాగుతున్న ఎపిఎండిసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి-రైల్వేకోడూర్ రూరల్

సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని ఎపిఎండిసి అవుట్ సోర్సింగ్, ట్రైనీ కార్మిక పోరాట కమిటీ జెఎసి ఆశ్వర్యంలో గురువారం భోజన విరామ సమయంలో కార్మికులు ఎంపిఎండిసి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమ కోర్కెలు తీర్చేంత వరకూ ఉద్యమం ఆగదని హెచ్చరించారు. నిరసనకు సిఐటియు నాయకులు చంద్రశేఖర్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎండిసి వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ బండారు భాస్కర్, ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి మావిళ్ళ చంద్రశేఖర్, జెఎసి కో-కన్వీనర్, అనుమల గుండం అరుణావతి, గల్లా జయశ్రీ, ట్రెజరర్, పి.ఈశ్వరయ్య, గునిపాటి మణి, పి.వేణుగోపాల్‌రెడ్డి, జి.దానమయ్య, పులగంటి రమణయ్య, ఎస్.పెంచలయ్య, చింతకాయల, ధనలక్ష్మి, ప్రతాప్ పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై సమీక్ష


రాయచోటి : రెండో దశ మనబడి నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలని పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో రెండవ దశ మనబడి "నాడు-నేడు" పనుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ గిరీష పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రస్తుతం ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చే లక్ష్యంతో రెండో విడత మనబడి నాడు-నేడు పనులు చేపడుతున్నామని చెప్పారు. నాణ్యతతో నిర్దేశించి చేసిన పనులకు సంబంధించి ఎప్పటి కప్పుడూ ఖర్చులు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా ఇంజినీరింగ్ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేయాలని సూచించారు. నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దన్నారు. జగనన్న విద్యా కానుక సంబంధించి బయోమెట్రిక్ పెండింగ్ లేకుండా క్లియర్ చేయాలన్నారు. అనంతరం గిరీష అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మనబడి నాడు-నేడు పనులు నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలన్నారు.

ట్రిపుల్‌ఐటిలో

విద్యార్థి ఆత్మహత్య

అమ్మా నాన్న కలిసి ఉండాలని సూసైడ్ నోట్

శోకసంద్రంలో విద్యార్థులు, తల్లిదండ్రులు



చనిపోక ముందు రాసిన సూసైడ్ నోట్



కుమారుడి మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లిదండ్రులు



ఊరేసుకున్న శ్రీఈశ్వర సాయి



శ్రీఈశ్వరసాయి (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్‌జెయుకెటి యూనివర్సిటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలో పియుసి - 2 చదివే శ్రీఈశ్వర సాయి(17) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. తన సూసైడ్ నోట్‌లో తల్లిదండ్రులిద్దరూ కలిసి ఉండాలని రాసి ఉంది. వివరాలు.. అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణానికి చెందిన నాగభూషణం, ఇరావతి దంపతులకు కుమారుడు శ్రీఈశ్వరసాయి. ఇడుపులపాయి ట్రిపుల్ ఐటిలో పియుసి-2 చదువుతున్నాడు. గురువారం క్లాస్‌కు వెళ్లకుండా హాస్టల్ గదిలోనే ఉండిపోయాడు. గదిలోని తోటి విద్యార్థులకు క్లాస్‌కు వెళ్లిన తరువాత ఎవరూ లేని సమయంలో తలుపులు మూసి ఫ్యాన్‌కు ఉరేసుకుని దుప్పటితో ఉరేసుకుని ఆత్మహత్య చేసు కున్నాడు. మధ్యాహ్నం భోజనం కోసం హాస్టల్ గదికి వచ్చిన విద్యార్థులు తలుపులు కొట్టినా తీయకపోవడంతో వారు ట్రిపుల్‌ఐటి అధికారులకు సమాచారం ఇచ్చారు. సెక్యూరిటీ సిబ్బందితో వచ్చిన అధికారులు కార్పెంటర్ సాయంతో తలుపులు తీశారు. విద్యార్థి ఫ్యాన్‌కు ఊరేసుకుని వేలా డుతూ కన్పించడంతో అధికారులు అవకయ్యారు. వెంటనే ఇడుపులపాయలోని ఆస్పతికి తరలి ంచారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీ కరించారు. ఆత్మహత్య విషయాన్ని ఉరవకొండలోని తల్లిదండ్రులకు డైరెక్టర్ సంధ్యారాణి తెలి యజేశారు. మృతుని తండ్రి ప్రయివేట్ స్కూల్‌లో బస్సుల కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నట్లు విద్యార్థులు పేర్కొన్నారు. శ్రీఈశ్వర్‌సాయి చదువులో చురుగ్గా ఉండేవారని అధ్యా పకులు తెలిపారు. అధికారుల ద్వారా సమాచారం అందుకున్న సిఐ గోవిందరెడ్డి, ఎస్ఐ రంగా రావు ట్రిపుల్‌ఐటికి చేరుకుని గదిని పరిశీలించారు. అక్కడ విద్యార్థి రాసిన సూసైడ్ నోట్ దొరికింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ పేర్కొన్నారు.

మాకు ఎలాంటి కుటుంబ సమస్యలు లేవు..

చదువుపై ఒత్తిడితోనే చనిపోయాడు

- విద్యార్థి తల్లిదండ్రుల ఆరోపణ

తమకు ఎలాంటి కుటుంబ సమస్యలు లేవని, ట్రిపుల్‌ఐటిలో టీచర్లు పెట్టే మానసిక ఒత్తిడి వల్లే చనిపోయాడని విద్యార్థి శ్రీఈశ్వర్‌సాయి తల్లిదండ్రులు నాగభూషణం, ఇరావతి ఆరోపిస్తున్నారు. తనకు గురువారం ఉదయం 10.15 గంటలకు ఫోన్ చేశాడని తండ్రి పేర్కొన్నారు. క్లాస్‌కు ఎందుకు వెళ్లలేదని అడగ్గా లీజర్ అని సమాధానం చెప్పాడని వాపోయారు. శెలవుల్లో ఇంటికొస్తే తమతో సంతోషంగా గడుపుతాడని పేర్కొన్నారు. చదువుపై ఒత్తిడితోనే చనిపోయి ఉంటాడని వారు తెలిపారు. రెండు రోజులుగా అతను మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు తోటి స్నేహితులకు చెప్పారని తెలిపారు. తనకు ఇద్దరు పిల్లలని కూమార్తె ఈశ్వరి డిగ్రీ రెండో సంవత్సరం ఉరవకొండలో చదువుతోందని చెప్పారు.

విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం

ఇడుపులపాయి ట్రిపుల్ ఐటీలో పియుసి - 2 విద్యార్థి శ్రీ ఈశ్వర్ సాయి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సంధ్యారాణి చెప్పారు. ట్రిపుల్ ఐటిలో ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరమని అన్నారు. ఇంటి వద్ద ఉన్న సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడని సూసైడ్ నోట్ ద్వారా తెలిసిందని చెప్పారు. విద్యార్థులు ఇలాంటి క్షణిక అవేశాలకు గురై ఆత్మహత్య చేసుకోవద్దని కోరారు.

సూసైడ్ నోట్‌లోని వివరాలు..

ప్రియమైన అమ్మకు, నాన్నకు

నేను ఇలా ఆత్మహత్య చేసుకోవడం తప్పే, కానీ తప్పలేదు. దయచేసి అర్థం చేస్తుకోగలరూ..ఇప్పటికైనా ఇద్దరూ కలిసి ఉండి మాట్లాడుకోండి. ఇదే నా చివరి కోరిక అనుకోండి. నేను మీకు పుట్టడం నా అదృష్టం. కానీ మీకు అది దురదృష్టం. ఎవరు అర్థం చేసుకున్నా, లేకున్నా మీరు నన్ను అర్థం చేసుకుంటారని భావిస్తున్నాను. నేను భయపడి చావట్లేదు, ముందు జరిగే సంఘటనలను ఎదుర్కొన లేకపో తున్నా.. దయచేసి క్షమించండి. అన్న దగ్గరకు వెళ్లండి.. ఆయన మిమల్ని చూసు కుంటాడని అనుకుంటున్నా. మళ్లీ జన్నంటూ ఉంటే మీ కొడుకుగా పుట్టాలని ఆశిస్తున్నాను. వీలైతే ఎవర్నో ఒకరిని దత్తత తీసుకోండి.

- ప్రేమతో మీ చిన్న (సాయి)

భూసేకరణ వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి



సమావేశంలో మాట్లాడతున్న కలెక్టర్ గిరీష

జిల్లాలో నిర్మిస్తున్న జాతీయ రహదారి-71లో భాగంగా మదనపల్లి నుంచి పీలేరు వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి సంబంధించి భూసే కరణను వేగవంతం చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశిం చారు. గురువారం భూసేకరణపై ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు, తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఎంత భూసేకరణ జరిగింది, ఇంకా ఎంత జరగాల్సి ఉంది, పరిహారం చెల్లింపు, డ్రాఫ్ట్ నోటిఫికేషన్ల జారీ తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఎన్‌హెచ్71 మదనపల్లి- పీలేరు 4 వరసల రహదారికి సంబంధించి వాయల్పాడు మండలంలోని వాయల్పాడు, చింతపర్తి, గండబోయనేనిపల్లి, తాటికుంటపల్లి, కలికిరి మండలంలోని కలికిరి, కెఆర్ పల్లి, కొర్లకుంట, పాతిగడ్డ, మదనపల్లి మండలంలోని సిటియం, కాశీరావు పేట, పోతబోలు, కొత్తవారిపల్లి, పీలేరు మండలంలోని బిఎంవిపల్లి, దొడ్డిపల్లి, గుండ్రేవుపల్లి, పీలేరు, వేల్పుల బైలు గ్రామాలలో మొత్తం 1921 మంది పట్టాదారులకు సంబంధించిన 466.88 ఎకరాల భూసేకరించామని చెప్పారు. ఇప్పటి వరకు 1181 మంది పట్టాదారులకు సంబంధించిన 274.14 ఎకరాలు భూమికి నష్టపరిహారం చెల్లించామని తెలిపారు. మిగిలిన 740 మందికి సంబంధించిన 182.73 ఎకరాల భూమికి నష్టపరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. భూసేకరణ ప్రక్రియలో పురోగతి కనిపించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వివిధ అంశాలలో సమీక్షించి పలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎఐ పీడీ హరికృష్ణ, భూసేకరణ తహశీల్దార్లు, విఆర్‌ఒలు, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా గృహాలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ

ప్రజాశక్తి - రాయచోటి

పేదలందరికీ పక్కాగృహాలు పథకంలో భాగంగా జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల పురోగతి, అనీమియా, గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చిన అర్జీల పరిష్కారం, ఆధార్ స్పెషల్ క్యాంపు, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జగనన్న లేఔట్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు సంబంధిత హౌసింగ్ అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తేనే పురోగతి కనిపిస్తుందని ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలు సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి శనివారం హౌసింగ్‌డే నిర్వహించి ఆరోజు అధికారులు జగనన్న లేఅవుట్ లు సందర్శించి ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన సమస్యలను హౌసింగ్ యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల ఇళ్ల నిర్మాణాలలో మరింత వేగం పెరుగుతుందన్నారు. ప్రతి లేఅవుట్ కు నీటి సౌకర్యం, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ తప్పక ఉండేటట్లు చూడాలన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ ఆవాజ్ యోజన పథకం కింద మంజూరైన గృహాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి మంజూరైన ఇల్లు అన్ని యుద్ధ ప్రాతిపదికన గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. చిన్న పిల్లలు, గర్భిణీలు, బాలింతలలో రక్తహీనత నివారణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనీమియా నివారణకు అంగన్వాడీ కేంద్రాలలో నాణ్యమైన పౌష్టికాహారం అందజేస్తారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు ఇవ్వడం జరిగిందని అధికారులు ప్రతి అర్జీని జాగ్రత్తగా పరిశీలించి సమస్య పరిష్కరించాలన్నారు. ఆధార్ అప్డేషన్‌కు స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ గిరీష మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ లే అవుట్లలో తప్పకుండా నీటి సౌకర్యం, కరెంటు సదుపాయం కల్పించాలన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు సంబంధిత హౌసింగ్ అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన కింద అన్నమయ్య జిల్లాకు 1391 ఇల్లు మంజూరయ్యాయని ఇవన్నీ వెంటనే గ్రౌండ్ అయ్యేటట్లు చూడాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ సత్యనారాయణ, హౌసింగ్ పీడీ శివయ్య, భూముల సర్వే విభాగం సహాయ సంచాలకులు జయరాజ్, సిపిఒ కృష్ణ నాయక్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి, డిఆర్‌ఒ


రైతులకు పరిహారం త్వరగా అందించండి : 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

నియోజకవర్గంలో జగనన్న ఇళ్ల స్థలాలకు భూసేకరణ చేపట్టి, భూమిని కేటాయించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జిల్లా కలెక్టర్ గిరీషను కోరారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో కలెక్టర్ గిరీషను కలుసుకొని, నియోజకవర్గంలోని సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ జాతీయ రహదారికి భూములు కోల్పోయి నష్టపరిహారం అందని రైతులకు త్వరతిగతిన నష్టపరిహారం అందించాలన్నారు. రైతులు నష్టపోకుండా మండల యూనిట్‌గా తీసుకొని నష్టపరిహారం అందించాలని కోరారు. నియోజకవర్గంలో ఇళ్ల స్థలాల కోసం నిరుపేదలు అర్జీలు పెట్టుకుంటున్నారని, ఇళ్ల స్థలాలకు స్థలం కేటాయించాలన్నారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజును మర్యాదపూర్వకంగా కలుసుకొని, వాల్మీకిపురంలో నూతనంగా నిర్మించనున్న పోలీస్ సర్కిల్ కార్యాలయానికి నిధుల మంజూరుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు చింతల ఆనంద రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్ గిరీషకు సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే చింతల


నారా లోకేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

నారా లోకేష్‌ను కలిసిన టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి మార్పురి రమేష్ బుధవారం విజయవాడ చంద్రబాబు నాయుడు అధికార నివాసంలో కలిశారు. మదనపల్లి నియోజకవర్గ పరిధిలోని కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ రాబోవు ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పార్లమెంట్ పరిధిలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో యువత పార్లమెంటు ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజ్, పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ కార్యనిర్వాహణ కార్యదర్శి రాజేష్, పొన్నూరు నియోజకవర్గ తెలుగు యువత నాయకుడు నాగరాజ్ పాల్గొన్నారు.

మండలంలో కరెంటు కష్టాలు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలో గురువారం ఉదయం నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు కరెంటు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శనివారం రోజు కరెంటు మెయింటనెన్స్ డే నిర్వహించాల్సిన కరెంటు అధికారులు గురువారం నిర్వహించడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మెయింటనెన్స్ పేరుతో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కరెంటు ఇవ్వకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఒక ప్రణాళికతో కరెంటు కోతలు విధించి మెయింటనెన్స్ డే ని నిర్వహించాలని, ఎప్పుడంటే అపుడు మెయింటనెన్స్ డే పేరుతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నియోజకవర్గ స్థాయి వాలీబాల్, కబడ్డీ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-బి.కొత్తకోట

జగనన్న క్రీడా సంబరాలు-2022లో భాగంగా తంబళ్ళపల్లి నియోజకవర్గ స్థాయి ఎంపికలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి. గురువారం కబడ్డీ, వాలీబాల్ జట్లను ఎంపిక చేశారు. ప్రతిభని ఆధారంగా తీసుకొని, అత్యంత పారదర్శకంగా జట్లను ఎంపిక చేశారు. కబడ్డీ జట్టుకు 11 మంది ప్రధాన ఆటగాళ్లు, ముగ్గురు స్టాండ్ బైలు, వాలీబాల్ జట్టుకు 11 మంది ప్రధాన ఆటగాళ్లు, ఇద్దరు స్టాండ్ బైలను తీసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.అంజాద్ అలీ ఖాన్, మండల విద్యాశాఖాధికారి ఆర్.రెడ్డిశేఖర్, అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.రామ, తంబళ్లపల్లి నియోజకవర్గ క్రీడా సమన్వకర్త తాజ్ బాషా, క్రికెట్ వివిధ పాఠశాలల పీఈటీ, పీడీలు పాల్గొని లాంఛనంగా కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ క్రీడాంశాలు ప్రారంభించారు.

ఎపిఆర్‌డిసి డైరెక్టర్‌గా గుల్జార్‌బాషా

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆంధ్రప్రదేశ్ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా వైసిపి సీనియర్ నాయకులు గండికోట గుల్జార్‌బాషాను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రవాణా, రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రహదారుల అభివృద్ధి సంస్థలో సభ్యులుగా రాష్ట్రంలోని 14 మంది డైరెక్టర్‌లకు పదవులు లభించాయి. వీరిలో జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం లభించింది. చిట్వేలి మండలం నుంచి ఒకరిని రాజంపేట మండలం నుంచి గుల్జార్ బాషాను ఎన్నుకున్నారు. ఈనెల 28వ తేదీన విజయవాడలోని ఆర్అండ్‌బి ప్రధాన కార్యాలయంలో ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుంది. వీరు ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గుల్జార్ భాష మాట్లాడుతూ కష్టపడి పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసినవారిని సిఎం జగన్మోహన్‌రెడ్డి ఎప్పుడూ మరువరని తెలిపారు. స్థానిక శాసనసభ్యులు మేడా వెంకట మల్లికార్జునరెడ్డి కోసం పనిచేస్తానన్నారు. తనకు డైరెక్టర్ పదవి రావడానికి కారణమైన ఎమ్మెల్యే మేడాకు, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, పార్లమెంటు సభ్యులు మిథున్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.


గుల్జార్‌బాషా


సయ్యద్ అమీర్‌ను సన్మానిస్తున్న ఎంపిపి విజయభాస్కర్‌రెడ్డి

సయ్యద్ అమీర్‌కు ఘన సన్మానం

నందలూరు: నిరంతరం పేద ప్రజల మధ్యలో ఉంటూ వారికి తనదైన శైలిలో సేవా సహకారాలు అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతూ వైసిపి పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న అమీర్‌ను పార్టీ గుర్తించి జిల్లా వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేయడం పట్ల గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద వైసిపి సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మైనార్టీలు అభినందనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మేడా పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం అమీర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డి, ఈ పదవి అప్పగించినందుకు వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన శాయశక్తుల కృషి చేసి ప్రజాసేవలో ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు కలీం, వైసిపి నాయకులు నడివీధి సుధాకర్, తుమ్మల శ్రీధర్, హిమగిరినాథ్, జుల్ఫికర్, ఓట్స్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యమే లక్ష్యంగా పనిచేయండి

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోనశశిధర్

ప్రజాశక్తి - రాయచోటి

జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా పల్లెల్లో సంపూర్ణ పారిశుధ్యమే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోనశశిధర్ అన్నారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ గిరీష పిఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధిశాఖ కమిషనర్ మాట్లాడుతూ డిపిఒల ద్వారా గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛ గ్రామాలను తీర్చిదిద్దాలని సూచించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణను చేపట్టడంతో పాటు ప్లాస్టిక్, పాలిథిన్ వ్యర్థాలను వేరుచేస్తూ గ్రామాలను ఆదర్శవంతంగా నిలిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా గ్రామకంఠంకు సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి పెట్టి కూలీల సంఖ్యను మరింత పెంచి లక్ష్యాన్ని వందశాతం సాధించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలలో వేగం పెంచి గడువు లోగా లక్ష్యాలను పూర్తి చేసేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను త్వరగా పూర్తి చేయాలన్నారు. క్లాప్ మిత్రా జీతాలకు సంబంధించి త్వరగా బిల్లులు అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ 24 గంటల్లోగా క్లాప్ మిత్రా జీతాలకు సంబంధించి వంద శాతం బిల్లులు అప్‌లోడ్ కావాలని సూచించారు. ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, పంచాయతీ కార్యదర్శులతో పర్యవేక్షిస్తూ బిల్లులు అప్‌లోడ్ చేయించాలని చెప్పారు. జిల్లాలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా గ్రామకంఠం రీ సర్వేను పక్కాగా నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. అత్యంత ప్రాధాన్యత క్రమంలో ప్రభుత్వం నిర్మిస్తున్న శాశ్వత భవన నిర్మాణాలలో స్టేజీల వారీగా ప్రతివారమూ తప్పనిసరిగా ప్రగతి ఉండాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్ఒ సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి జయరాజు, డ్వామా పీడీ మద్దిలేటి, డిపి నాగరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ పివి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గిరీష, అధికారులు

వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్‌గా కరీముల్లా


కరీముల్లాను అభినందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా మదనపల్లెకు చెందిన ఎస్‌ఎ కరీముల్లా నియమితులయ్యారు. వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కష్టపడుతూ, రెండు సార్లు 14వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్‌గా తన తల్లి, సతీమణిని గెలిపించడంతో పాటు నిత్యం ప్రజలకు అండగా, అందుబాటులో గుర్తింపు తెచ్చుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఉప ఎన్నికలు జరిగినా అక్కడ ఒక సైనికుడుగా పనిచేసేవారు. కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో తనకు అప్పగించిన బాధ్యతలు నెరవేర్చి అభ్యర్థుల గెలుపులో భాగస్వామ్యమయ్యారు. పార్టీ అధిష్టానం జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ నియమించింది. ఎంపీ మిథున్‌రెడ్డి, రాజంపేట, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జునరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా కరీముల్లా మాట్లాడుతూ తనకు ఈ పదవి అందించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ద్వారకనాథరెడ్డి, నవాజ్‌బాషా, చింతల రామచంద్రారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అందించి గురుతర బాధ్యతలను శక్తివంచనా లేకుండా పూర్తిచేస్తానన్నారు. జిల్లా అంతటా పర్యటిస్తూ వక్ఫ్ బోర్డు అభివృద్ధి, ఆస్తుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. వైసిపి కౌన్సిలర్లు, మైనారిటీ నాయకులు అభినందించారు.

ఉపాధి హామీ పనులపై ప్రణాళికలు సిద్ధం : ఎపిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గుర్తించిన పనులకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు ఎపిఒ రమేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం "పనుల గుర్తింపు- ప్రణాళిక ప్రక్రియ" కార్యక్రమంపై అగ్రహారం, తవళం, కొండయ్యగారిపల్లి పంచాయతీలలో గ్రామ సభలను నిర్వహించామన్నారు. 2023-24 సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కూలీలకు పనులు కల్పించడానికి, పని దినాలను పెంచడానికి చేపట్టవలసిన చెరువుల పూడిక తీతలు, ఉద్యానవన పంటల సాగు, నీటి కుంటలు ఏర్పాటు, కందకాలు తీయడం, కాలువ పుడికతీత తదితర పనులను క్షేత్రస్థాయి సిబ్బంది గుర్తించి ఎంపిక చేయడం జరిగిందన్నారు. వారు ఎంపిక చేసిన పనులను పంచాయతీల వారీగా గ్రామసభలు నిర్వహించి పనులను ఆమోదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఉషారాణి, రెడ్డప్ప, వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు మంజుల, మంజునాథ్, ఉపాధి హామీ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్‌లు పద్మావతి, దివ్యభారతి, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రజలకు 100 రోజులు పని కల్పించడమే లక్ష్యమని ఎపిఒ కృష్ణ చైతన్య తెలియజేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రణాళిక ప్రక్రియలో భాగంగా గురువారం ఊటుకూరు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి బాలకుమార్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. గుర్తించిన పనులకు గాను గ్రామసభ ఆమోదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు వంద రోజులు పని కల్పించి ఉపాధి కల్పించనున్నామని తెలిపారు. తగిన ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరయ్య, ఉపాధి హామీ టిఎలు, ఎఫ్ఎలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



నిమ్మనపల్లి : అగ్రహారం గ్రామసభలో మాట్లాడుతున్న ఎపిఒ రమేష్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ శేఖర్‌నాయక్

ప్రజలకు సేవలందించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-గాలివీడు

సచివాలయాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు చేరువ చేయాలని ఎంపిడిఒ శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఒక్కరోజు డిజిటల్ అసిస్టెంట్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కల్యాణ రైల్వే టికెట్లు ఈ శ్రమ ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమోటి మహేష్, టిఒటి వెంకటేశ్వర్లు, సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. **8 మంది వాలంటీర్లకు నియామక పత్రాలు** మండల పరిధిలోని ఆయా సచివాలయాల్లో వాలంటీర్లు విధుల్లో చేరడానికి గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ శేఖర్‌నాయక్ నివామక పత్రాలు అందజేశారు. శుక్రవారం నుంచి విధుల్లో చేరాలని పేర్కొన్నారు. పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ముఖ్య పాత్ర పోషించాలని చెప్పారు. గాలివీడుకు ఒకరు, తూముకుంటకు ఒకరు, గరుగుపల్లికి ఒకరు కొర్లకుంటకు ఒకరు, నూలివీడుకు ఒకరు చొప్పున నియమించారు.

పిసిసి అధ్యక్షుని నియామకంపై హర్షం

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షునిగా ఎన్నికైన గిడుగు రుద్రరాజు నియామకం పట్ల కాంగ్రెస్ పార్టీ రాయచోటి నియోజకవర్గ బాధ్యుడు షేక్. అల్లా బకష్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎఐసిసి ఉత్తర్వులు మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా గిడుగు రుద్రరాజు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా మస్తాన్ వలి, జంగా గౌతమ్, పద్మశ్రీ సుంకర, రాకేష్ రెడ్డి నియమితులయ్యారన్నారు. ఎఐసిసి కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఎం.ఎం.పల్లంరాజు, క్యాంపెన్ కమిటీ చైర్మన్ జి.వి.హర్షకుమార్, మీడియా చైర్మన్‌గా డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి నియమితులయ్యారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని కోరారు.

నిర్దేశించిన గడువులోగా పూర్తి

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లను నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలని మార్కెటింగ్ శాఖ కమిషనర్ ప్రద్యుమ్న అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి మల్టీపర్పస్ ఫెసిలిటీ కేంద్రాల నిర్మాణాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్లను నిర్మిస్తోందన్నారు. ఎంపిఎఫ్ఎస్ నిర్మాణాలకు సంబంధించి ఎక్కడైనా స్థల సమస్య ఉన్నట్లయితే సంబంధిత రెవెన్యూ అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. రైతులకు ఎన్నో ప్రయోజనాలున్న గోడౌన్ల నిర్మాణాలలో నిర్లక్ష్యం చూపకుండా నిర్దేశించిన గడువులోపల పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ గిరీష పి ఎస్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశలో 6 మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్లు, రెండవ దశలో 16, మూడవ దశలో 91 మంజూరయ్యారని తెలిపారు. ఇవన్నీ త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణాలకు స్థల సమస్య ఉన్నట్లయితే సంబంధిత తహశీల్దార్లకు తెలియజేసి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధ శాఖ జిల్లా అధికారి గుణశేఖర్ పిళ్లి , మార్కెటింగ్ శాఖ ఏడి త్యాగరాజు, జిల్లా కో - ఆపరేటర్ గురు ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు వాహనాలకు వేలం

ప్రజాశక్తి-చిన్నమండెం

పలు కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్రవాహనాలకు ఎస్‌పి ఆదేశాల మేరకు ఈనెల 25న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రారంభ ధర రూ.8 వేలు ఉంటుందని తెలిపారు.

'పెద్దిరెడ్డి'ని విమర్శిస్తే ఊరుకోం : వైసిపి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ అహ్మద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకులు దొమ్మలపాటి రమేష్ కనీసం విషయ పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని తెలిపారు. నాలుగు దశాబ్దాలలో జరగనటువంటి అభివృద్ధిని ద్వారకనాథరెడ్డి కేవలం మూడున్నర సంవత్సరాలలో చేసి చూపించాలన్నారు. టిడిపి నాయకులు పెద్దిరెడ్డి కుటుంబంపై అర్థరహితమైన ఆరోపణలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి రామచంద్ర యాదవ్, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కంచి బలరాంరెడ్డి, గుడిపల్లి సర్పంచ్ రఘు, ఎంపిటిసి రామసుబ్బారెడ్డి, ఎం.వి.కృష్ణయ్య పాల్గొన్నారు.

వేలం పాటలో రూ.1.32 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లో గురువారం నిర్వహించిన ద్విచక్ర వాహన వేలం పాటలో ప్రభుత్వానికి రూ.1.32 లక్షల ఆదాయం వచ్చినట్లు ఎస్ఇబి సిఐ మల్లిక తెలిపారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు మదనపల్లి ఇఎస్ పర్యవేక్షణలో12 వాహనాలకు వేలం వేశారు. ఈ అక్రమ మద్యం, ఇసుక రవాణా చేయడం నేరమని తెలిపారు. ఇటువంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ నారాయణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.


వాహనాలకు వేలం పాట నిర్వహిస్తున్న సిఐ మల్లిక


అతిథి గృహాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ఎంపిపి

అతిథి గృహాన్ని పరిశీలించిన టూరిజం ఆర్‌డి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని ఆడపూరి ముక్తికనుమ వద్ద ఏర్పాటు చేసిన బౌద్ధారామాల అతిథి గృహాన్ని గురువారం టూరిజం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రాంప్రసాద్, డిపార్ట్మెంట్ మేనేజర్ పుష్పరాజు, డిటిఒ నాగభూషణం, ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మేడా రూ.1.30 కోట్లతో ఏర్పాటు చేసిన అతిథి గృహం ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బౌద్ధ మత ప్రచారానికి ఆనవాళ్లు ఉన్న ఈ ప్రాంత ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని ఇక్కడ బౌద్ధ అతిథి గృహాన్ని నెలకొల్పారన్నారు. అది ప్రారంభోత్సవానికి నోచుకోకపోగా అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైందన్నారు. స్పందించిన అధికారులు వీలైనంత త్వరగా ఈ ప్రదేశాన్ని బౌద్ధాశ్రమంగా మార్చే ప్రయత్నం చేస్తామని బుద్ధిష్ట్ సేవ సంఘాలతో మాట్లాడి దీని ప్రాముఖ్యత చాటి చెప్పేలా చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సౌమ్యనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వర్ఫ్స్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, ఆడపూరు సర్పంచ్ భాస్కర్ రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు కలీం పాల్గొన్నారు.

27న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతయ్యగారిపల్లి గ్రామ సచివాలయంలోఈ నెల 27వ తేదీ నుండి డిసెంబర్ 4వ తేదీ ఆదివారం వరకు ఎనిమిది రోజులపాటు చెన్నై శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, టంగుటూరు చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైసిపి నాయకులు కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంటి చికిత్స సేవ ఉత్తర అమెరికా తెలుగు సమితి, డాక్టర్ టంగుటూరి సంజీవరెడ్డి ఉచితంగా చేయిస్తున్నారన్నారు. వైద్య శిబిరానికి వచ్చేవారు తప్పనిసరిగా ఫోన్ నెంబర్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రావాలన్నారు. చికిత్సకు వచ్చిన వారికి ఆపరేషన్ ఐఒఎల్ లైన్స్, కంటి అద్దాలు, మందులు ఉచితంగా ఇస్తామన్నారు. బిపి, షుగర్ ఇతర వ్యాధులు ఉన్నవారు కంటి చికిత్సకు వచ్చేటప్పుడు వారి వెంట వారు వాడే మందులు తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు. కంటి చికిత్స జరిగిన తరువాత రెండు గంటలలో ఇంటికి వెళ్లవచ్చునని తెలిపారు. ఈ ఉచిత చికిత్సను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


బస్టాండులో బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి : సర్పంచ్

ప్రజాశక్తి-నందలూరు

నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి శుభ్రం చేస్తున్నట్లు సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండు, అరవపల్లిలోని క్రీడామైదానంతో పాటు ఇతర ప్రాంతాలలో నిలబడి ఉన్న చెత్తను తొలగించి, బ్లీచింగ్ చేయించానన్నారు. పంచాయితీలకు రావాల్సిన నిధులు, దారిమలుతున్న పంచాయతీలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించానన్నారు. పంచాయతీలో నీటి సమస్య ఉందని, ఈ సమస్యపై ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శేఖర్‌తో బుధవారం చర్చించామన్నారు. తనకున్న పరిధిలో సమస్యలు తన దృష్టికి వస్తే వాటి పరిష్కారాన్ని కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రయోగాలతోనే ప్రయోజనం

ప్రజాశక్తి- గాలివీడు

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సైన్సు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు తయారు చేసిన నమూనాలతో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని హెచ్‌ఎం బి. రెడ్డన్న పర్యవేక్షించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను చూసి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అభినందించారు. ఐదు నమూ నాలను మండలస్థాయికి ఎంపిక చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. **రాయచోటి:** నేతాజీ సర్కిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ పాఠశాలలో పలు ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించడం గొప్పవిషయమన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించి వారిని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశామన్నారు. పాఠశాలలో ప్రాజెక్టుల ప్రదర్శన వల్ల విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ సైన్స్ ఎగ్జిబిషన్ల వల్ల విద్యార్థులలో సైన్స్ సబ్జెక్టు పట్ల ఆసక్తి కలుగుతుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, సైన్సు ఉపాధ్యాయులు ఖాదర్ బాషా, తౌఫిక్ ఆలీ, సీనియర్ ఉపాధ్యాయులు రాజా, ఫణీంద్ర, హాషీం ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు



సైన్స్ ఫెయిర్‌లో ప్రయోగాలతో విద్యార్థులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో సిఆర్‌పి మృతి

ప్రజాశక్తి-రామాపురం

వేంపల్లి-రాయచోటి ప్రధాన రహదారిపై మండలం పరిధిలోని కుమ్మరపల్లి సమీపంలో గురువారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో సిఆర్‌పి నాగేంద్రయాదవ్ మృతి చెందారు. లక్కిరెడ్డిపల్లి విద్యాశాఖ కార్యాలయంలో సీఆర్పీగా పనిచేస్తున్న నాగేంద్ర లక్కిరెడ్డిపల్లె నుంచి రాయచోటికై బైక్‌పై బయలుదేరారు. కుమ్మరిపల్లె సమీపానికి రాగానే పాండిచ్చేరి నుంచి వేంపల్లెకు వెళ్తున్న కారీ బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో నాగేంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ కొండారెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. మార్గమధ్యలో ఆయన మృతి చెందారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.